ఘనంగా వ్యాసాశ్రమ శతాబ్ది ఉత్సవాలు


ఉత్సవాల్లో పరిపూర్ణానందస్వామి, వినయ్‌కుమార్

చిక్కడపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ మలయాళ స్వామి మఠం ఆధునికీకరణ, వ్యాసాశ్రమ శతాబ్ది ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వ్యాసాశ్రమ పీఠాధిపతులు పరిపూర్ణానందగిరిస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్‌గుప్తా, శివకుమార్, కె.సత్యం, లింగ ప్రకాష్, ఆనంద్‌గుప్తా, మలయాళస్వామి ఆశ్రమ భక్తబృందం పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా గణేష్

రాంనగర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా గణేష్ నియమితులయ్యారు. ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు వనపర్తిలో జరిగిన పీడీఎస్‌యూ రాష్ట్ర 4వ మహాసభలలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడీఎస్‌యూ బలోపేతం కోసం, విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు.

చెట్ల తొలగింపును పరిశీలించిన కార్పొరేటర్

రాంనగర్ : రాంనగర్ డివిజన్‌లోని ఆజామాబాద్, వీఎస్టీ, బాగ్‌లింగంపల్లి ప్రధాన రోడ్లలో రోడ్లకు అడ్డంగా, ప్రమాదకరంగా ఉన్న చెట్ల తొలగింపు పనులను కార్పొరేటర్ కె.రవిచారి జీహెచ్‌ఎంసీ హార్టికల్చర్ విభాగం ద్వారా శుక్రవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

రాంనగర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయ నిధిలో భాగంగా రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ ద్వారా ముషీరాబాద్‌కు చెందిన కె.శ్రీనివాస్‌కు మంజూరైన రూ.1.75లక్షల చెక్కును యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ శుక్రవారం అందజేశారు.

నేటి ర్యాలీని విజయవంతం చేయాలి

ముషీరాబాద్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : నగరంలో శనివారం నిర్వహించే చలో హైదరాబాద్ దళితుల ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ కోరారు. శుక్రవారం ముషీరాబాద్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడి చేసినా ఎలాంటి కేసులు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న కేంద్రం, పోలీసుల వైఖరిని నిరసిస్తూ నిర్వహించే దళితుల ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేసేందుకు నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున దళితులు తరలిరావాలని కోరారు.

విద్యా హక్కు చట్టం అమలు చేయాలి

నల్లకుంట : వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో విద్యా హక్కు చట్టం అమలు చేయాలని బహుజన ప్రజాశక్తి(ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల హక్కుల ఉద్యమ వేదిక) నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరుల సమావేశంలో బహుజన ప్రజాశక్తి కన్వీనర్ నల్లా లక్ష్మణ్, నగర ఇన్‌చార్జి శ్యామ్‌ప్రకాష్‌లు మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు ఉదయ్ మల్లేష్, విష్ణుకుమార్, పి.నర్సింగ్‌రావు, బి.దేవరాజ్, ఎన్.వినోద్, ఎర్ర నాగేష్, ఎన్.అశోక్‌కుమార్, జి.శ్రావణ్‌కుమార్, రవి పాల్గొన్నారు.

ఉద్యమకారులను పట్టించుకోకపోతే ఊరుకోం

చిక్కడపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులను పట్టించుకోకపోతే ఊరుకునే ప్రశ్నేలేదని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర నిర్ణయం ప్రకారం ఇట్టె ప్రభాకర్‌ను రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించి శుక్రవారం చిక్కడపల్లిలోని జేఏసీ కార్యాలయంలో ఆయనకు నియామక పత్రం అందజేశారు. రాష్ట్ర కమిటీ వర్కింగ్ అధ్యక్షులు కేసీఎస్ ప్రసాద్, ఎ. యాదగిరి, ఆంజనేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

దేవుడికి సేవ చేయడం అదృష్టం : ఈఓ లక్ష్మారెడ్డి

చిక్కడపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దేవాలయ ఉద్యోగులుగా దేవుడికి సేవచేయడం అదృష్టమని ఆర్టీసీ క్రాస్‌రోడ్డు లక్ష్మీగణపతి ఆలయ ఈవో లక్ష్మారెడ్డి అన్నారు. మలక్‌పేట్ ఎంసీహెచ్‌కాలనీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ఈవో రాజన్ ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం లక్ష్మీగణపతి ఆలయంలో ఈవోలు, అర్చక, ఉద్యోగుల యూనియన్ నేతలు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఈవోలు దేవనాథం, చంద్రారెడ్డి, కృష్ణమాచారి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రాజారామన్న గాత్ర విభావరి

చిక్కడపల్లి : త్రివేణి సంగమం కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీముఖి స్టూడియోలో సంస్థ అధ్యక్షుడు, ప్రముఖ గాయకుడు డా. రాజారామన్న నిర్వహించిన గాన విభావరి, పద్యాల ఆలాపన శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. రాజారామన్నతో పాటు జ్యోతిర్మయి, అనూపద్మలత, మారుతీరావులు పలు సినీ, ఆధ్యాత్మిక గీతాలు ఆలపించారు. కాగా వివిధ రంగాలకు చెందిన వారిని సావిత్రిబాయిపూలే, సేవారత్న, మహిళాసేవారత్న అవార్డులతో సత్కరించారు. న్యాయవాది డా. రాధికరావు, లయన్ మురళీధర్ పాల్గొన్నారు.

బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా కరుణాకర్


కరుణాకర్‌కు నియామకపత్రం ఇస్తున్న ఆర్.కృష్ణయ్య

రాంనగర్ : బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా ఎంపీటీసీ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు బోళ్ల కరుణాకర్ నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆర్.కృష్ణయ్య ఆయన నియామకాన్ని ప్రకటించి నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ చైర్మన్ అనంతుల రామ్మూర్తిగౌడ్, ఎంబీసీ విద్యార్థి, యువజన సంఘం అధ్యక్షుడు పి.బడేసాబ్, అజయ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.


2న బీసీ, ఎంబీసీ కుల సంఘాల సదస్సు

రాంనగర్ : కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఈనెల 2న నగరంలోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో బీసీ ఎంబీసీ కులాల సదస్సు నిర్వహిస్తున్నట్లు బీసీ జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ ఎంబీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే పోస్టర్‌ను శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ, ఎంబీసీ కుల సంఘాల చైర్మన్‌లు రామ్మూర్తిగౌడ్, బడేసాబ్, నాయకులు సి.రాజేందర్, నీల వెంకటేష్, ఎంపీటీసీ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు బోళ్ల కరుణాకర్, నాయకులు రాందేవ్‌మోదీ, సతీష్ పాల్గొన్నారు.

మానవతావాది విజయకుమార్

రాంనగర్ : కళా సాహిత్య సేవా రంగాలకు అనితరసాధ్యమైన సేవలు చేసిన లయన్ డాక్టర్ ఎ.విజయకుమార్ మానవతావాది అని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన లయన్ ఎ.వి జయకుమార్ జయంతి వేడుకలు జరిగాయి. పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, జస్టిస్ బి.చంద్రకుమార్, తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బి.ఎస్.రాములు తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.విజయలక్ష్మి, డాక్టర్ జెల్ది విద్యాధర్, శ్రీరాందత్తు, డాక్టర్ రాధా కుసుమ, రామకృష్ణ, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కవి సమ్మేళనం జరిగింది.

రాజ్యాంగ హక్కులపై రౌండ్ టేబుల్ సమావేశం


మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

రాంనగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సంక్షోభ కాలం - రాజ్యాంగ హక్కులు అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పట్లోళ్ల నాగిరెడ్డి, సదానందల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రెండు తెలుగు రాష్ట్రాల గౌరవ అధ్యక్షురాలు విమలక్క, జస్టిస్ బి.చంద్రకుమార్ పాల్గొని మాట్లాడారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం


ప్రేమ్‌నగర్‌లోని హైమావతి పాఠశాల వద్ద వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పుష్పాలు సమర్పిస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ అదనపు డీసీపీ జోగుల నర్సయ్య

నల్లకుంట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో సంస్థానాల విలీనానికి ముందడుగు వేసిన ధీరుడు, దేశ సమైక్యతకు బీజం వేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ నుంచి నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వరకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో యూనిటీ రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ అదనపు డీసీపీ జోగుల నర్సయ్య, అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ తదితరులు పాల్గొని మాట్లాడారు. దేశ ఏకత్వం, సామరస్యం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అందరూ కష్టపడితేనే భవిష్యత్తులో ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, సీఐ, ఎస్ఐ, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట: సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లోని హైమావతి పాఠశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు వల్లభాయ్ పటేల్ జీవిత విశేషాలను, స్వాతంత్ర్య పోరాటాన్ని వివరించారు. నేటితరం విద్యార్థులందరూ పటేల్‌ను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణతో కష్టపడి చదువుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్ అన్నారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి విద్యార్థులు పుష్పాలు సమర్పించారు.


నింబోలిఅడ్డలోని డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ తదితరులు

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి : డీసీపీ


మాట్లాడుతున్న డీసీపీ శిల్పవల్లి

ముషీరాబాద్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సెంట్రల్‌జోన్ డీసీపీ కె. శిల్పవల్లి సూచించారు. శుక్రవారం ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భోలక్‌పూర్, ఇందిరానగర్, బాకారం తదితర ప్రాంతాల్లో డీసీపీ పర్యటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వీధుల్లో వ్యాపారులు, కాలనీవాసులు సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ పోలీసులు వీధుల్లో పర్యటిస్తున్నారా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సోషల్‌మీడియాలో వచ్చే ఫేక్ న్యూస్‌లు నమ్మవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, సీఐ రాంబాబు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిరుద్యోగ బాకీకార్డు విడుదల


బాకీకార్డును ఆవిష్కరిస్తున్న నిరుద్యోగ జేఏసీ నేతలు, నిరుద్యోగులు

చిక్కడపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీ సమీపంలో శుక్రవారం నిరుద్యోగ జేఏసీ నేతలు, నిరుద్యోగ విద్యార్థులు కాంగ్రెస్ నిరుద్యోగులకు పడ్డ బాకీ కార్డును విడుదల చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావొస్తున్నా ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయలేదని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ నేతలు, నిరుద్యోగ విద్యార్థులు శంకర్‌నాయక్, కయ్యు వెంకటేష్, సింధురెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో పెట్టిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. ఇందుకు ప్రభుత్వంపై నిరుద్యోగులు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ ప్రభుత్వం వచ్చాక ఒక్క జనరల్ నోటిఫికేషన్ ఇవ్వలేదని ఆరోపించారు. ఇంకా ఆలస్యం చేయకుండా ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు శ్రీనివాస్, రమేష్, బాలకోటి, కుమార్, మధు, గణేష్, ఆకాష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ సమగ్రాభివృద్ధికి కమలానికి ఓటు వేయాలి

నల్లకుంట : జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్‌నగర్ డివిజన్‌లోని బూత్ నెంబర్ 158,154,152 లలో పార్టీ ఆదేశాల మేరకు బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లకుంట డివిజన్‌కు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేసి గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కమలానికి ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రహమత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు ప్రశాంత్, అనిల్, రాబిన్, నవీన్ పాల్గొన్నారు.

అంబర్‌పేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



రాంనగర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : అంబర్‌పేట నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలోని కాలనీలు, బస్తీల్లో సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్ల ఆధునికీకరణ పనులను దశలవారీగా నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రధాన రోడ్లతోపాటు అంతర్గత రోడ్ల అభివృద్ధి, ఫుట్‌పాత్‌ల ఆధునికీకరణ చేపడుతున్నామన్నారు. కాలనీల్లో పార్కుల అభివృద్ధి, సందర్శకులకు మౌలిక వసతుల కల్పన చేపడుతున్నామన్నారు. అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణం వల్ల తలెత్తిన సర్వీస్‌రోడ్ల నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ ద్వారా ప్రతిపాదనలు చేసి అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తామన్నా రు. నియోజకవర్గంలో వర్షాకాలంలో వరదనీటి సమస్యలు తలెత్తకుండా నాలాలకు ఇరువైపులా ప్రహరీల నిర్మాణాలు జీహెచ్‌ఎంసీ ద్వారా చేపడుతున్నామన్నారు. మూసారాంబాగ్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రభుత్వం త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు సమస్యలు లేకుం డా చూడాలని జీహెచ్‌ఎంసీ అధికారులపై ఎ ప్పటికప్పుడు ఒత్తిడి తీసుకువస్తున్నా మన్నా రు. మూసారాంబాగ్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో జాప్యం వల్ల గోల్నాక కొత్త బ్రిడ్జి నుంచి నిత్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులకు గురవుతున్న ప్రజల సమస్యలపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి మూసారాంబా గ్ బ్రిడ్జి నిర్మాణ పనులు వెనువెంటనే పూర్తైతే అంబర్‌పేట నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం కానున్నదన్నారు. ని యోజకవర్గంలోని పలు ఆలయాలలో పనిచేస్తున్న పౌరోహితులకు తన సొంత డబ్బుతో ఆర్థిక సహకారం అందిస్తున్నారు. చనిపోయిన పేదల అంత్యక్రియలు, దహన సంస్కారాల కోసం వారి కుటుంబానికి తాను ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ముస్లింల కోసం శ్మశానవాటికను ఆలీకేఫ్ చౌరస్తా సమీపంలోని మూసీ పరీవాహక ప్రాంతంలో ఏర్పాటు చేశామన్నారు.

జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ విజయం తథ్యం

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత విజయం తథ్యమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్నివర్గాల ప్రజలు బీఆర్ఎస్‌కు సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నదనే దీనికి ఉదాహరణ అని అన్నారు. నియోజకవర్గంలో మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజలు ఆకర్షితులై బీఆర్ఎస్‌కు ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్‌కి ఓటమి భయం పట్టుకుందని దీని వల్లనే సీఎం రేవంత్‌రెడ్డి ఉప ఎన్నికల ప్రచారానికి వస్తున్నారని అన్నారు. మైనారిటీ ఓట్లను దండుకోవడం కోసమే అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని, దీంతో ఈ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేస్తామని అంటున్నారని అన్నారు. బీఆర్ఎస్ గెలుపును అడ్డుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి డివిజన్‌కు ఒక మంత్రిని ఇన్‌చార్జిగా, సెక్టార్‌కు ఒక ఎమ్మెల్యేను పెట్టారని ఎద్దేవ చేశారు.

మంత్రి శ్యామ్ కిడ్నాప్ కథ సుఖాంతం..!

అంబర్‌పేట : మంత్రి శ్యామ్ కిడ్నాప్ కథ సుఖాంతమైంది. బుధవారం కిడ్నాప్‌నకు గురైన డీడీకాలనీకి చెందిన మాజీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, రియల్టర్ శ్యామ్‌ను అంబర్‌పేట పోలీసులు సురక్షితంగా ఇంటికి చేర్చారు. అంబర్‌పేట డీడీ కాలనీలోని కృష్ణతేజ రెసిడెన్సీలో నివాసం ఉండే మంత్రి శ్యామ్‌ను కొందరు వ్యక్తులు బలవంతంగా తీసుకెళ్లినట్టు అతని రెండో భార్య ఫాతిమా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, డీఐ హఫీసుద్దీన్‌ల ఆధ్వర్యంలో ఐదు బృందాలుగా ఏర్పడిన పోలీసులు ముమ్మరంగా గాలించారు. అయినా ఫలితం లేదు. శుక్రవారం సాయంత్రం శ్యామ్ తనంతట తాను అంబర్‌పేట పోలీసులకు ఫోన్‌చేసి ఎల్బీనగర్‌లో ఉన్నట్టు చెప్పినట్టు తెలిసింది. అతను ఇచ్చిన సమాచారం మేరకు అక్కడకు వెళ్లిన పోలీసులు శ్యామ్‌ను అదుపులోకి తీసుకొని ఈస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయంలో విచారించారు. అనంతరం అతని బంధువుకు అప్పగించి ఇంటికి పంపారు. ఈ విషయంపై ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ తమకు వచ్చిన సమాచారం ప్రకారం శ్యామ్‌ను అదుపులోకి తీసుకున్నామని, పొంతన లేకుండా ఆయన సమాధానాలు చెబుతున్నాడన్నారు. కాగా.. అలీకేఫ్ చౌరస్తా సమీపంలో శ్యామ్‌ను తామే పట్టుకున్నామని ఆయన చెప్పాడు. ఎల్బీనగర్‌లో ఉన్న స్నేహితుడి ఇంటికి వెళ్లానని శ్యామ్ చెప్పడం గమనార్హం. కిడ్నాప్ విషయం రెండు, మూడు రోజుల్లో వివరంగా చెప్తానని వెళ్లిపోయాడు.

గవాయిపై దాడి న్యాయవ్యవస్థపై జరిగిన దాడి

- నేడు దళితుల ఆత్మగౌరవ ర్యాలీ
- ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ

బర్కత్‌పుర, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై జరిగిన దాడి న్యాయవ్యవస్థ, రాజ్యాంగంపై జరిగిన దాడి అని ఎమ్మార్పీఎస్ అధినేత, పద్మశ్రీ మంద కృష్ణమాదిగ అన్నారు. దాడి జరిగి 25రోజులు గడచినా నిందితుడిని ఇంత వరకు అరెస్ట్ చేయలేదని ఆరోపించారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని అన్ని విషయాలపై స్పందించే ఎన్‌హెచ్‌ఆర్‌సీ దీనిపై ఎందుకు స్పందించలేదన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని బలంగా చాటిచెప్పడానికే నవంబర్ 1న ఇందిరాపార్కు నుంచి లోయర్ ట్యాంక్‌బండ్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం నుంచి బషీర్‌బాగ్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గోవింద్, నరేష్‌మాదిగ, యాదయ్య మాదిగ పాల్గొన్నారు.

రియాజ్ చనిపోయింది పోలీసు కస్టడీలోనే

- సిటిజన్స్ ఫోరం నిజనిర్ధారణ ప్రతినిధులు

బర్కత్‌పుర, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో జరిగిన రియాజ్ ఎన్‌కౌంటర్‌పై సీబీఐతో విచారణ జరిపించాలని సిటిజన్స్ ఫోరం నిజనిర్ధారణ ప్రతినిధులు డిమాండ్ చేశారు. రియాజ్ పోలీసు కస్టడీలోనే చనిపోయాడని, అతడు క్రిమినల్ కాదని వారు పేర్కొన్నారు. ఈ మేరకు సిటిజన్స్ ఫోరం నిజనిర్ధారణ ప్రతినిధులు ఖలీదా పర్వీన్, సారా మాథ్యూస్, మాజిద్ సుతారి, న్యాయవాది సమీర్‌అలీ, మహ్మద్ అబ్దుల్ తాజ్, షేక్ సికిందర్ బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రియాజ్ ఎన్‌కౌంటర్ అనంతరం తాము నిజామాబాద్ వెళ్లి విచారణ చేయగా చాలా విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. రియాజ్ బైక్ రికవరీ ఏజెంట్‌గా పని చేసేవాడని, కానిస్టేబుల్ ప్రమోద్ హత్య అనంతరం పోలీసులు రియాజ్ కుటుంబాన్ని కస్టడీలోకి తీసుకుని చిత్రహింసలకు గురి చేశారని తెలిపారు. పోలీస్‌స్టేషన్, ఆస్పత్రి పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. రియాజ్‌ను అక్టోబరు 20న ఎన్‌కౌంటర్ చేశారని, అదే నెల 17న కానిస్టేబుల్ ప్రమోద్ హత్య జరిగిందన్నారు. రియాజ్ ఎన్‌కౌంటర్‌పై విచారణను ప్రభుత్వం సిట్‌కు అప్పగించిందని, కానీ సీబీఐకి అప్పగిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. కానిస్టేబుల్ ప్రమోద్‌ను ఎవరు చంపారో తేలాలని అన్నారు. రియాజ్ చాకుతో పొడిచి ప్రమోద్‌ను చంపాడని పోలీసులు పేర్కొంటున్నారని, దీనిపై కూడా పూర్తి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రియాజ్ ఎన్‌కౌంటర్ తర్వాత అతని కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని, ఆ కుటుంబానికి రూ.5కోట్ల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.